## మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు

**కలెక్టర్ ప్రతీక్‌జైన్**



వికారాబాద్, మార్చి 26: మహిళా సంఘాలకు వడ్డీ రుణాలు అందజేస్తున్నామని కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతీక్‌జైన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తూ వారి అభ్యున్నతి కోసం పలు రకాల కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం 10,805 సంఘాలకు 2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి వరకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణలు రూ.20.35కోట్లు మంజూరు చేశామన్నారు. ఈ సందర్భంగా పలు మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రికి, సంస్థ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారని తెలిపారు.

## 148 వాహనాలకు వేలం

**ఎస్పీ నారాయణ రెడ్డి**

వికారాబాద్, మార్చి 26 : పారదర్శకంగా, న్యాయమైన రీతిలో వదిలివేసిన/గుర్తు తెలియని వాహనాలకు వేలం వేశామని ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం వికారాబాద్ జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (డీటీసీ)లో 148 వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వేలం ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, న్యాయమైన రీతిలో నిర్వహించామన్నారు. అందరూ స్వేచ్ఛగా పాల్గొని న్యాయమైన ధరలకు వాహనాలను కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించామన్నారు. ఈ వాహనాలపై ఎవరికైనా యాజమాన్య హక్కులు ఉంటే, వారు గతంలో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించామని, నిబంధనలకు అనుగుణంగా దర్యాప్తు చేసిన తర్వాతనే వేలం వేసినట్లు ఎస్పీ వివరించారు. కార్యక్రమంలో వాహనాల వేలం కమిటీ చైర్మన్, అదనపు ఎస్పీ టీవీ హనుమంత్‌రావు, ఏవో జోతిర్మయి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, వేలం క్రయదారులు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) లిటరసీ హౌజ్లో వివిధ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సర్టిఫికెట్ కోర్సులైన ఎంఎస్ ఆఫీస్ ఇంటర్నెట్, ట్యాలీ ప్రైమ్, బ్యూటీషియన్ కోర్సులతో పాటు స్పోకెన్ ఇంగ్లీష్ అండ్ కెరీర్ గైడెన్స్, పైథాన్, టైలరింగ్, డిజైనర్ బ్లౌజెస్, డ్రెస్ డిజైనింగ్, మగ్గం వర్క్, జూట్ బ్యాగ్ మేకింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, తదితర కోర్సుల్లో అన్ని వయసుల వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. వేసవి నేపథ్యంలో ఏడేళ్లు పైబడిన పిల్లలకు పాట్ పెయింటింగ్, గ్లాస్ పెయింటింగ్, డిజైనర్ పేపర్ బ్యాగ్స్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, యోగా, ఫ్లవర్ మేకింగ్, జ్యువెలరీ మేకింగ్, తదితర కోర్సులను అందిస్తున్నట్లు వివరించారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు వచ్చే నెల 6లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కోర్సులు విద్యార్థులు, నిరుద్యోగ యువత, గృహిణిలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సీట్లు పరిమితమని, ముందుకొచ్చిన వారికి ప్రథమ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామన్నారు. కోర్సుల్లో చేరేందుకు ఎలాంటి వయో పరిమితి లేదని, కోర్సులను విజయ వంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు ఇస్తామని, వివరాలకు 6281139282లో సంప్రదించాలన్నారు.

### ఎంబీఏ పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో నిర్వహించిన ఎంబీఏ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

### ఓరియంటల్ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఓరియంటల్ లాంగ్వేజెస్ కోర్సుల (ఓఎల్సీసీ, పీడీసీ, బీఏ లాంగ్వేజెస్, ఎంఏ లాంగ్వేజెస్) పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల వార్షిక పరీక్షలను వచ్చే నెల 17 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

# కరెంట్ కష్టాలు

- అప్రకటిత కోతలతో ఆగమాగం
- లోఓల్టేజీతో ఇబ్బందులు
- ఎండుతున్న పంటలు
- ఆందోళనలో రైతులు, వినియోగదారులు



గంజిపల్లి తండాలో ధారలా పోస్తున్న బోరు బావి

దోమ, మార్చి 26 : విద్యుత్ అప్రకటిత కోతలు ప్రజలు, రైతులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. మార్చిలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి గృహ వినియోగానికి 24 గంటల కరెంటు ఇస్తున్నామని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో కరెంటు పరిస్థితి భిన్నంగా ఉందని దోమ, లింగనపల్లి, అయినాపూర్, దిర్సంపల్లి గంజిపల్లి తదితర గ్రామాల రైతులు, గృహ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ పగటి వేళల్లో వ్యవసాయానికి ఇచ్చే త్రీఫేజ్ కరెంటు నాలుగు నుంచి ఐదు పర్యాయాలు అంతరాయం ఏర్పడుతుందని వ్యవసాయదారులు చెబుతున్నారు. ఎండాకాలం కారణంగా భూగర్భ జలాలు అడుగంటి బోరు బావుల్లో నీటి లభ్యత తగ్గిపోయింది. దానికి తోడుగా కరెంటు నిరంతరాయంగా ఉండకుండా వచ్చిపోవడంతో నీరు ముందుకు సాగక పంట చేలు ఎండిపోతున్నాయి. ఈ యాసంగి పంటలు ముగిసే వరకైనా అంతరాయం లేకుండా విద్యుత్‌ను సరఫరా చేయాలని రైతులు వేడుకుంటున్నారు. రాత్రి సమయంల్లో గృహాలకు ఇచ్చే సింగిల్ ఫేజ్ కరెంట్ సైతం లోఓల్టేజీతో ఫ్యాన్లు కొంత సమయం స్పీడ్‌గా తిరగడం మరి కొంత సమయం నిదానంగా తిరగడంతో గృహ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

**కోతల్లేని కరెంట్‌ను అందించాలి**



మూడెకరాల్లో వరి నారు వేశా. అంతా కంకి దశలో ఉంది. బోరులో నీరు తగ్గడంతో పొలం ఆరిపోతున్నది. భూగర్భ జలం తగ్గిన కారణంగా బోరు బావుల నుంచి నీరు దారలాగా వస్తున్నది.ఆ నీరు ముందుకెళ్లి పొలం తడవాలంటే కరెంటు నిరంతరాయంగా ఉంటే సాధ్యపడుతుంది. కరెంటు వచ్చి పోకుండా నిరంతరం ఉండేలా అధికారులు చర్యలు తీసుకొని తదనుగుణంగా ముందు జాగ్రత్తలు చేపట్టి రైతులను ఆదుకోవాలి.

**- కేతావత్ రమేశ్, రైతు, గంజిపల్లి తండా, దోమ మండలం**

**లోఓల్టేజీని నివారించాలి**



ప్రతి రోజు గృహాలకు ఇచ్చే ఉచిత కరెంటు డేటైమ్‌లో బాగానే ఉన్నప్పటికీరాత్రి సమయంలోఓల్టేజీ తగ్గడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫ్యాన్‌ల స్పీడ్ తగ్గడంతో దోమల బెడద ఎక్కువై నిద్రపోలేని పరిస్థితి దాపురిస్తున్నది. అధికారులు సమస్యను గుర్తించి నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి.

**- గార్లపల్లి అంజి, అయినాపూర్, దోమ మండలం**

## పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

- వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మార్చి 26 : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 2024–25 రబీ సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పకడ్బందీ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రబీ లో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. కొనుగోళ్ల ప్రణాళిక ప్రకారం ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మిల్లులకు తేమ లేకుండా నాణ్యమైన వరి ధాన్యాన్ని తరలించేలా రైతులు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.

**128 కొనుగోలు కేంద్రాలు**

జిల్లాలో 128 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రం దగ్గర ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ధరలు, తేమ శాతం తదితర వివరాలు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రం దగ్గర క్లీనింగ్ మిషన్, తేమ శాతం కొలిచే పరికరాలు, తాగునీరు ఇతర ఏర్పాట్లు చేయాలన్నారు. గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2,320 చెల్లిస్తామని, సన్నరకానికి అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామన్నారు. సాదారణ ధర రూ.2300 ఉంటుందని, టార్పాలిన్లు, ప్యాడి క్లీనర్లు, తేమ యంత్రాలు, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.

**ఆధార్ కార్డు నమోదు తప్పనిసరి**

రైతుల ఆధార్ కార్డు వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ అన్నారు. చెక్ పోస్ట్‌ల దగ్గర రెవెన్యూ, పోలీస్, సివిల్ సప్లయ్ సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ఆయా కేంద్రాల వద్ద ఏఈవోలు ప్రణాళిక ప్రకారం రైతులకు టోకెన్లు ఇచ్చి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చేలా చేయాలన్నారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా కొనుగోళ్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు సిద్ధం చేయాలన్నారు. రవాణా విషయంలో రైతులు నష్టపోకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో మోహన్‌బాబు, సివిల్ సప్లయ్ డీఎం వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, ఆర్‌టీఏ వెంకట్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ మోహన్ కృష్ణ, ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను అధిగమించాలి

- గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలి
- జడ్పీ సీఈవో, అదనపు కలెక్టర్ సుధీర్
- మండల అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో, అదనపు కలెక్టర్ సుదీర్

మర్పల్లి, మార్చి 26 : గ్రామాల్లో తాగునీటి సమస్యను అధిగమించాలని జడ్పీ సీఈవో, అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా పల్లెల్లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించాలని సూచించారు. గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. ప్రతి పంచాయతీలో 10 వేల మొక్కలు నాటేందుకు నర్సరీల్లో పెంచాలని తెలిపారు. ఉపాధి హామీలో భాగంగా కూలీలందరికీ పని కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజమల్లయ్య, తహసీల్దార్ మునీరొద్దీన్, ఈసీ విఠల్, ఎంపీవో లక్ష్మీకాంత్, ఏపీవో అంజిరెడ్డి, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మహిళలు స్వశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలి

- డీఆర్‌డీఏ పీడీ శ్రీలత
- ఎలిమినేడులో తల్లికోళ్ల పెంపకం షెడ్డు ప్రారంభం



ఎలిమినేడులో తల్లికోళ్ల పెంపకం షెడ్డును ప్రారంభిస్తున్న పీడీ శ్రీలత

ఇబ్రహీంపట్నం, మార్చి 26 : మహిళలు స్వశక్తితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీలత అన్నారు. మండల పరిధిలోని ఎలిమినేడులో ఉపాధిహామీ పథకం కింద మంజూరైన తల్లికోళ్ల పెంపకం షెడ్డును బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. మహిళలకు ప్రభుత్వం నుంచి అందుతున్న ఫలాలతో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ షెడ్డులో చిన్న కోళ్ల పిల్లలను తయారుచేసి జిల్లాలో నాటుకోళ్ల పెంపకం దారులకు కోడి పిల్లలను అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మహిళా సభ్యులందరికీ పెరటికోళ్ల పెంపకంలో భాగంగా ప్రతి ఒక్కరికీ కోడి పిల్లలు అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో పౌల్ట్రీ షెడ్లు త్వరితగతిన పూర్తిచేసి ఈనెలాఖరు వరకు పేమెంట్ చేసుకుంటే వారికి వెంటనే నిధులు మంజూరు చేసే అవకాశం ఉందని తెలిపారు. అలాగే హహిళా సంఘాల ద్వారా పాడి పరిశ్రమ నిమ్మితం రుణాలు తీసుకున్న వారికి పశువుల షెడ్డు నిర్మాణానికి ఉపాదిహామీ పథకం ద్వార ఒకొక్కరికీ రూ.83వేలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. మండలంలోని ఎలిమినేడులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు, నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం క్లస్టర్ ఏపీడీ నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటమ్మ, ఏపీవో తిరుపతాచారి, ఈసీ రవికుమార్, ఏపీఎం రవిందర్, సీసీ నర్సింహ, పంచాయతీ కార్యదర్శి రవిందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## విధులకు వెళ్లొస్తూ.. అనంతలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి
- అనాథలైన నలుగురు పిల్లలు
- ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులే
- తిమ్మాపూర్‌లో ఘటన



పాండు (ఫైల్), సక్కుబాయి (ఫైల్)

కొత్తూరు, మార్చి 26 : వాళ్లిద్దరూ భార్యాభర్తలు. ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు. విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై తిరిగి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని తిమ్మాపూర్ వద్ద జరిగింది. కల్వకుర్తి మండల పరిధిలోని రఘుపతిపేటకు చెందిన పాండు(45), కొందుర్గు మండల కేంద్రానికి చెందిన సక్కుబాయి భార్యభర్తలు. వీరికి నలుగురు సంతానం. ఇద్దరు కుమర్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పాండు ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సక్కుబాయి మహేశ్వరం మండల పరిధిలోని టీడీ తండాలో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. పిల్లల చదువుల కోసం వీరు హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లో నివాసం ఉంటున్నారు. విధులు ముగించుకుని మంగళవారం రాత్రి కొందుర్గు నుంచి రామంతాపూర్‌కు స్కూటీపై వెళ్తుండగా 44వ జాతీయ రహదారిపై తిమ్మాపూర్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో సక్కుబాయి అక్కడికక్కడే మృతి చెందింది. పాండుకు తీవ్ర గాయాలు కావడంతో దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందారు. దీంతో వీరి నలుగురు పిల్లలు అనాథలయ్యారు. పిల్లల ఆలన, పాలనా చూసే వారెవరని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పోలీస్ స్టేషన్ ఆవరణలో నినదిస్తున్న విద్యార్థి నేతలు

## ప్రజాపాలన అంటే ఇదేనా?

**ఓయూలో పోలీసు రాజ్యం**

**ముందస్తు అరెస్టులపై మండిపడ్డ విద్యార్థి సంఘాలు**

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలో పోలీసుల రాజ్యం కొనసాగుతోంది. విద్యార్థులు నిద్ర లేవక ముందే హాస్టల్ గదుల్లోకి ప్రవేశించి బలవంతంగా ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు నిరాటంకంగా తరలిస్తున్నారు. తాజాగా బుధవారం వర్సిటీలో గవర్నర్ పర్యటన నేపథ్యంలో విద్యార్థి నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ఓయూలో వీసీ ప్రొఫెసర్ కుమార్ ప్రజాస్వామ్య వాతావరణాన్ని సమాధి చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చెప్పుకుంటున్నట్లుగా ప్రజా పాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. ప్రజాపాలన, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఏడో గ్యారెంటీ అని చెప్పి.. ఓయూను పోలీసు రాజ్యంగా మార్చి విద్యార్థుల స్వేచ్ఛ, హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని పది రోజులుగా శాంతియుతంగా నిరసనలు చేస్తున్నా.. ఇప్పటికీ అధికారులు స్పందించకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. పైగా విద్యార్థుల హాస్టల్ లోకి, తరగతి గదుల్లోకి, లైబ్రరీ లోకి పోలీసులకు అనుమతి ఇచ్చి అరెస్టులు చేయించడం దారుణమన్నారు.

## మరింత పారదర్శకంగా బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ

**త్వరలో సీఆర్ఎస్ విధానం అమలు**




సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ పరిధిలో బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ మరింత పారదర్శకంగా ఉండేందుకు నూతన విధానాన్ని అమలు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ నిర్ణయించారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సివిలియన్స్ రిజిస్ట్రేషన్ సిస్టం(సీఆర్ఎస్) పరిధిలోకి బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ విధానాన్ని తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం అమలవుతున్న విధానం ద్వారా అవినీతి, అక్రమాలు జరగడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఇబ్బడిముబ్బడిగా బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ జరుగుతున్నదని గుర్తించారు. ఈ నేపథ్యంలో సీఆర్ఎస్ విధానం ద్వారా అక్రమాలకు తావులేకుండా ఉంటుందని అధికారులు భావించారు. ప్రస్తుతం ఈ విధానం జీహెచ్ఎంసీ అవతల ఉన్న మున్సిపాలిటీల్లో అమలు చేస్తున్నారు. జీహెచ్ఎంసీలో ఇప్పటికే అమలు చేయాల్సి ఉండగా...కుల గణన సర్వే, ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక ఫోకస్ ఉండడంతో సమయాన్ని తీసుకున్నారు. ఈ విధానం అమలు కోసం పూర్తిగా అనుభవం ఉన్న అధికారులను ఎంపిక చేసి తొలుత శిక్షణ ఇచ్చి ఆ తర్వాత వచ్చే నెల మొదటి వారం నుంచి అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# భూగర్భ జలాలు కలుషితం

- 16 వ్యవసాయ బోర్లలో కలుషిత నీరు
- తగ్గిపోయిన పంట దిగుబడులు
- నీళ్లు తాగని పశువులు
- పట్టించుకోని అధికారులు



గుంతబాసుపల్లి పంచాయతీ కార్యాలయం ముందున్న బోరులో నుంచి వస్తున్న కలుషిత నీరు

తాండూరు రూరల్, మార్చి 26 : ఆ గ్రామంలోని వ్యవసాయ బోర్లలో కలుషిత నీరు వస్తున్నది. పంట దిగుబడులు తగ్గిపోయాయి. పొలాల వద్ద పశువులు, మేకలు నీళ్లు తాగడం లేదు. మిషన్ భగీరథ నీరే ఆ గ్రామానికి దిక్కు. వివరాలు ఇలా ఉన్నాయి.... తాండూరు మండల పరిధిలోని గుంతబాసుపల్లి గ్రామంలోని వ్యవసాయ బోర్ల నీరు కలుషితమయ్యాయి. దీంతో పంట దిగుబడులు భారీగా తగ్గాయి. బీఆర్ఎస్ హయాంలో నూతనంగా గుంతబాసుపల్లి నూతన పంచాయతీగా ఏర్పడింది. ఈ గ్రామంలో 10 వ్యవసాయ బోర్లు, ఆరు తాగునీటి బోర్లు ఉన్నాయి. ప్రస్తుతం గ్రామంలో నాలుగు బోర్ల నీటిని వాడడం లేదు. రెండు బోర్లు మాత్రం కొనసాగుతున్నాయి. ఈ బోర్లన్నంటిలో కలుషిత నీరు వస్తున్నది. గ్రామ సమీపంలోని ఓ కెమికల్ ఇండస్ట్రీ (ఫ్యాక్టరీ) కారణమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గతేడాది ఈ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం చోటు చేసుకొని పూర్తిగా దగ్ధం కావడంతో కెమికల్ వ్యర్థాలను అలాగే వదిలేశారు. దీంతో భూగర్భ జలాలు కలుషితమయ్యాయని స్థానికులు చెబుతున్నారు. ఈ కెమికల్స్‌ను తీసివేస్తామని యాజమాన్యం చెప్పినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఏ బోరులో నుంచి వచ్చే నీరైనా సరే దుర్వాసన వస్తున్నది. వ్యవసాయ పొలాల్లో పంట పండించే రైతన్నకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటి కారణంగా పంట పొలాల్లో ఉల్లి, వరి నాట్లు వేసేందుకు కూలీలు మొగ్గు చూపడంలేదు. నీటి కారణంగా చర్మ వ్యాధులు వస్తున్నాయని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీటి కారణంగా చర్మంపై దద్దుర్లు వస్తున్నాయంటున్నారు. పశువులను బోర్ల వద్దకు తెసుకెళితే వాసన చూసి నీరు తాగడం లేదంటున్నారు.

**తగ్గిపోయిన పంట దిగుబడులు**

ఈ గ్రామంలో 90 శాతం మంది రైతులు ఉల్లి పంట సాగు చేస్తారు. కలుషీత నీటికారణంగా పంట దిగుబడులు కూడా తగ్గిపోయాయి. గతంలో 3 ఎకరాలకు 300 బస్తాల ఉల్లి పంట పండేది. ప్రస్తుతం 200 బస్తాలు కూడా పండడం లేదు. గ్రామంలోని రైతులు జగప్ప, మ్యాతరి కాశప్ప, లంబాడి నర్సింగ్‌నాయక్, న్యామత్ అలీ, కుర్వ కాశప్ప, ఎక్బాల్, దస్తప్ప, జగదీశ్, పండరి, అస్రత్‌మియా, జగదీశ్‌గౌడ్ ప్రతి ఏటా ఉల్లి పంట సాగు చేస్తారు. కలుషిత నీరు కారణంగా కొంత మంది పంట వేయడం మానేశారు. కొందరికీ ఇదే జీవనాధారం కావడంతో విధి లేని పరిస్థితిలో ఉల్లి పంట సాగు చేస్తున్నారు. పంట దిగుబడులు భారీగా తగ్గిపోయి, ఆర్థికంగా చితికి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చుట్టపు చూపుగా వచ్చి వెళ్లారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**మిషన్ భగీరథ నీళ్లే దిక్కు**

ఉదయం నుంచి సాయంత్రం వరకు పశువులకు మేపుకొని వచ్చి, ఇంటి వద్ద మిషన్ భగీరథ నీళ్లు నిల్వ ఉంచుకొని పశువులకు తాగించాల్సి వస్తున్నని గ్రామస్తులు తెలిపారు. ఈ నీళ్లు వంట చేసుకోవడానికి, పశువులకు ఉపయోగిస్తున్నారు. తాగునీటి కోసం మినరల్ వాటర్‌పై ఆ గ్రామం మొత్తం ఆధారపడి ఉంది. ఉదయం లేవగానే ముందుగా తాగు నీటి కోసం పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి మినర్ వాటర్ డబ్బాల్లో మోటార్ సైకిళ్లపై తీసుకొవస్తారు. ఇటు సాగునీటి, తాగు నీటి కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**అధికారులు పట్టించుకోవడంలేదు**



గుంతబాసుపల్లి సమస్యను అధికారులు దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడంలేదు. నీటి దర్వాసనతో గ్రామస్తులు అనారోగ్యానికి గురవుతున్నారు. అలాగే తాగునీటి కోసం మోటార్ సైకిళ్లపై రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెన్నా ఫ్యాక్టరీ నుంచి నిత్యం తీసుకొస్తున్నాం. అధికారులు స్పందించి, తాగునీటి, సాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి.

**- జగదీశ్‌గౌడ్, రైతు, గుంతబాసుపల్లి**



ఉల్లినాట్లు వేస్తున్న కూలీలు (ఫైల్)

## మీర్‌పేటలో ఇంటి పన్నులు తగ్గించండి

బడంగ్‌పేట, మార్చి 26 : మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంటి పన్నులు తగ్గించాలని కమిషనర్ జ్ఞానేశ్వర్ బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు సిద్దాల లార్డ్స్ బీరప్ప, ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ , దోమలపల్లి ధనలక్ష్మీ రాజకుమార్, ఉయ్యాల నవీన్ గౌడ్ తదితరులు వినతిపత్రం అందజేశారు. కార్పొరేషన్‌లో ఇటీవల పెంచిన అధిక శాతం ఇంటి పన్నులను తగ్గించాలన్నారు.

**ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి కృషి వల్లే ఓటీఎస్**

**బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు**

వన్ టైం సెటిల్‌మెంట్ తీసుకురావడంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి క్రియాశీలకంగా వ్యవహరించారంటూ.. వారు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.



కమిషనర్ కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు